AKSHARA TODAY

అక్షర నేటిడే


TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

ఓపెన్ జిమ్‌లపై నీలినీడలు..



2



2

రెండేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం..

ప్రభుత్వ సలహాదారును కలిసిన టీఎన్జీవో ప్రతినిధులు



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని టీఎన్జీవో నిజామాబాద్ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఉద్యోగుల సమస్యలపై చర్చించగా.. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా ఛైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట

23-10-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2



రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లా వ్యాప్తంగా రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అతిలమ నాగేష్, చిట్టి పార్థసారధి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రజాపంపిణీ వ్యవస్థలో తాము కీలకంగా పనిచేస్తున్నామన్నారు. అయితే చాలీచాలని గౌరవ వేతనంతో ఆర్థికంగా కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన మేనిఫెస్టో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. నిత్యావసరాల ధరలకు అనుగుణంగా రేషన్ డీలర్ల కమీషన్‌ను పెంచాలన్నారు. దిగుమతి హామాలీని ప్రభుత్వమే భరించాలని కోరారు. ప్రతి రేషన్ షాప్‌నకు ఖచ్చితమైన తూకం వేసి పంపాలని డిమాండ్ చేశారు.



పుష్కరాల పనులు వేగవంతంగా చేపట్టాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక అధికారి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు ఇతర అధికారులతో కలిసి కందకుర్తి పుష్కర ఘాట్‌ను సందర్శించారు. దేవాదాయ, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పరిశీలించిన ఆయన అధికారులకు కీలక సూచనలు చేశారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండాలన్నారు. ఒక్కో శాఖ వారీగా చేపట్టిన పనుల వివరాలు సమీక్షించి, మార్పులు చేర్పులకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. ఆలయాల అభివృద్ధి, నవీకరణ, నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం, ఘాట్ల మరమ్మతులు, రోడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, పార్కింగ్, వీఐపీ ఘాట్ నిర్మాణం తదితర పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. జిల్లాలోని కందకుర్తి, యంచ తదితర గోదావరి పరీవాహక పుణ్యక్షేత్రాల వద్ద పుష్కరాలు నిర్వహించే అన్ని ప్రాంతాల్లో పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. కందకుర్తి వద్ద గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నందున కొత్త పుష్కరఘాట్ నిర్మాణానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు. నీటి మట్టం తగ్గిన మీదట పుష్కర ఘాట్ పనులు చేపట్టి రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. బోధన్ ఆర్డీవో విజయకుమారి, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ శాఖల అధికారులు ఉన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నాణ్యత ప్రమాణాల పేరుతో మిల్లర్లు భారీగా తరుగు తీస్తూ మోసగిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రతి సీజన్‌లో కోతలు విధించడంతో తాము నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– అక్షరటుడే, డిచ్‌పల్లి



తరుగు దోపిడీని అడ్డుకోండి

■ భారీగా తరుగు తీస్తున్న మిల్లర్లు ■ నష్టపోతున్న రైతులు
■ ఆన్‌లైన్ ట్రక్ షీట్ ఇవ్వాలని విజ్ఞప్తి ■ పట్టించుకోని అధికారులు

యాసంగిలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆన్‌లైన్ ట్రక్‌షీట్' విధానంతో దోపిడీకి తావులేకుండా పోయింది. కానీ అది కొద్ది రోజులకే నిలిపివేసి, మళ్లీ పాత 'మ్యాన్యువల్ విధానాన్ని' తెరపైకి తెచ్చారు. కాంటా సమయంలో కొనుగోలు కేంద్రంలోనే రైతు సమక్షంలో ఆన్‌లైన్ ట్రక్‌షీట్ ఇస్తే తరుగు దోపిడీకి అడ్డుకట్టపడుతుంది.

జిల్లాలో సాగు ఇలా..

జిల్లాలో ప్రస్తుతం 5,44,000 ఎకరాల్లో పంటలు సాగవుతుండగా, అందులో ఏకంగా 4,30,000 ఎకరాల్లో వరి పంటనే వేశారు. మొక్కజొన్న 63 వేల ఎకరాలు, పసుపు 19 వేల ఎకరాల చొప్పున సాగవుతున్నాయి. జిల్లా వ్యవసాయ రంగంలో కేవలం లక్ష ఎకరాల్లోనే ఆరుతడి సాగవుతుండటంతో వరి ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. కానీ, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో కేవలం వరిపైనే ఆధారపడటం అత్యంత ప్రమాదకరమని తెలుస్తోంది.

మిల్లులకు వెళ్లేసరికి..

కాంటా వేసిన బస్తాలు లారీల్లో మిల్లులకు వెళ్లిన తర్వాత బరువు తక్కువ వస్తోందన్ని క్వింటాలుకు నాలుగైదు కిలోలు తరుగు పేరుతో మిల్లర్లు కోత పెడుతున్న పరిస్థితి. ప్రతిసీజన్‌లో జరిగే తంతు జరుగుతోంది. నాణ్యత పేరుతో మిల్లర్లు తరుగు దోపిడీ చేసేందుకు పాతవిధానం అవకాశం ఇచ్చింది. ప్రతి లారీలో క్వింటాళ్ల కొద్దీ కోత పెట్టడంతో నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోయారు. పాత విధానంతోనే ఈ దందాకు అవకాశం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత పేరుతో మిల్లర్లు తరుగు దోపిడీ చేసేందుకు పాత మ్యాన్యువల్ విధానం ఎంతో అవకాశం కల్పిస్తోందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఎల్‌నినో ఎఫెక్ట్..

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం, దిగుబడులు తగ్గింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కొనుగోళ్లలో ఆన్‌లైన్ ట్రక్‌షీట్ విధానాన్ని మళ్లీ అమలు చేస్తేనే తరుగు దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని అన్నదాతలు కోరుతున్నారు. తరుగు దందా గురించి అధికారులకు తెలిసినా, మిల్లర్లు ఇచ్చే ముడుపుల ఆశ కొద్దీ పారదర్శకత లేని మ్యాన్యువల్ విధానానికే మొగ్గు చూపుతున్నారని విమర్శలు వస్తున్నాయి.

ఆధునిక సాంకేతికతతో నాణ్యమైన విద్యుత్ సరఫరా



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: వినియోగదారులకు మరింత నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పలు కీలక చర్యలు చేపడుతున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజినీర్ రాజేశ్వర్ రావు తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఏదైనా ఒక లైన్ లేదా సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు ఇప్పటివరకు 126 సబ్‌స్టేషన్లను అనుసంధానించామన్నారు. ఆధునిక సాంకేతికతతో 11 కేవీ లైన్లలో 36 ఎఫ్‌పీఐలను ఏర్పాటు చేశామని.. లైన్లలో లోపాలు (ఫాల్ట్స్) ఎక్కడ ఏర్పడ్డాయో ఇవి వేగంగా గుర్తించి ఎస్ఎంఎస్ హెచ్చరికలు, ఫ్లాష్ లైట్ సంకేతాల ద్వారా సమాచారం ఇస్తాయని పేర్కొన్నారు. దీనివల్ల పెట్రోలింగ్ సమయం తగ్గి, మరమ్మతులు త్వరగా పూర్తవుతాయన్నారు. పెరుగుతున్న లోడ్‌కు అనుగుణంగా ప్రతీ సబ్‌స్టేషన్‌లో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో సరఫరా మెరుగవుతుందన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అక్షరటుడే, కామారెడ్డి : మొక్కలను నాటడమే కాకుండా, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం ఆయన రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో పర్యటించారు. వన మహోత్సవంలో నాటిన మొక్కలకు నీరు పోసి వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి ఆరోగ్యంగా పెరిగేలా చూడటం కూడా అంతే ముఖ్యమన్నారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, అవి ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో కొత్తగా ఇళ్లు మంజూరైన అటికెల భూమయ్య, గణేశ్‌లకు మంజూరు పత్రాలను అందజేశారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే గ్రామానికి చెందిన కందూరి భూలక్ష్మి రైతు పొలంలో నిర్మాణంలో ఉన్న వ్యవసాయ క్షేత్రపు నీటి కుంట ఫామ్ పాండ్ పనులను పరిశీలించారు. ఫామ్ పాండ్ల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చని, భూగర్భ జలాల పెంపునకు దోహదపడటంతో పాటు పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందించుకోవచ్చని తెలిపారు. డీఆర్‌డీవో దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమాలత, ఏఈ పీఆర్ సురేష్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ విష్ణువర్ధన్, ఏఈ ట్రాన్స్ కో సుధాకర్, ఏపీవో ధర్మారెడ్డి, సర్పంచ్ కిషన్ యాదవ్, ఉప సర్పంచ్ మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శబరిమాత ఉత్సవాల్లో పాల్గొన్న వడ్డేపల్లి సుభాష్ రెడ్డి



అక్షరటుడే, ఎల్లారెడ్డి: నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెదలో జరిగిన పరమహంస సచ్చిదానంద శబరిమాత 37వ వార్షికోత్సవంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, ఎల్లారెడ్డి నియోజకవర్గ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం పాదుకా పూజ మహోత్సవం నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రె సాయిలు, రాకేష్, వెంకటరెడ్డి, దుర్గయ్య, సంగమేశ్వర్, చెన్నం గారి శ్రీనివాస్ రెడ్డి, పరంధాములు, జైపాల్ రెడ్డి, సంతోష్ పాటిల్, ఆఫీస్ పటేల్, ధనవత్ రాజు, నీల రవి, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం : మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి



అక్షరటుడే, కామారెడ్డి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఇళ్ల నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లలిత చిట్టిబాబు, ఆర్వో గోపాల్ రెడ్డి, రాజ్ కుమార్, వార్డు ఆఫీసర్ వినయ్, దీప్తి పాల్గొన్నారు.

రైతులు వరిసాగుకు దూరంగా ఉండాలి

అక్షరటుడే, బాన్సువాడ: ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరిసాగుకు దూరంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి జి. వీరస్వామి సూచించారు. వర్ని సీసీడీలో శుక్రవారం ఎల్‌నినో పరిస్థితులపై అదనపు కలెక్టర్ రాజా గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉష్ణోగ్రతలు పెరిగి, నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. వరిసాగుకు బదులుగా తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను సాగు చేయాలన్నారు. ఒక ఎకరం వరి పంట సాగుకు సీజన్‌లో సుమారు 30 నుంచి 40 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుందని తెలిపారు. ప్రస్తుతం భూగర్భ జలమట్టం సాధారణ సగటు కంటే తక్కువగా ఉండి, సుమారు 9 మీటర్ల లోతుకు పడిపోయిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా వరిపంటకు నీటికొరత ఏర్పడితే పంట ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు.



క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



అక్షరటుడే, నిజామాబాద్ క్రైం : పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. నవంబర్‌లో జరగనున్న గేమ్స్ మీట్ ముగింపు ఏర్పాట్లపై సీపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నిర్వహించనున్న క్రీడా పోటీలకు అవసరమైన ట్రాక్‌ల ఏర్పాటు, క్రీడా మైదానాల సిద్ధీకరణ, క్రీడాకారులకు వసతి సౌకర్యాలపై సీపీ సమీక్షించారు. వైద్య సేవలు, తాగునీటి సరఫరా, భోజన ఏర్పాట్లు తదితర అంశాలపై పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులతో సమగ్రంగా చర్చించారు. వివిధ ప్రాంతాల నుంచి ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే పోలీస్ క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో చేపట్టాలని సూచించారు. అదేవిధంగా క్రీడాకారుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన వైద్య సిబ్బంది, ప్రథమ చికిత్స సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. స్పోర్ట్స్ మీట్‌ను పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (జాన్కంపేట్), అలీ సాగర్, నాగారం గ్రౌండ్, కాలూరు రోడ్డు, ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్, ముప్కాల్ ఆర్చరీ అకాడమీ మొదలగు ప్రాంతాలలో పోటీలు జరగనున్నాయి. అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, కృష్ణ, నరేందర్, గురు నాయుడు, మస్తాన్ అలీ, డీవైఎస్‌వో పవన్ కుమార్, కోచ్‌లు పాల్గొన్నారు.

డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీపై స్పష్టత ఇవ్వాలి



అక్షరటుడే, భీమ్‌గల్: పట్టణంలో నూతన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని భీమ్‌గల్ పురపాలక కౌన్సిలర్ నీలం రవి అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కార్డులు ఎక్కడ పొందాలి.. ఎవరిని సంప్రదించాలి.. అనే విషయాలపై స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరాలంటే వాటిని పొందే విధానంపై కూడా అధికారులు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంచాలని నీలం రవి సూచించారు. భీమ్‌గల్ తహశీల్దార్ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీపై స్పష్టమైన ప్రకటన చేయాలని నీలం రవి కోరారు. కార్డుల పంపిణీ కేంద్రాలు, వాటిని పొందేందుకు సంప్రదించాల్సిన అధికారులు, ఇంకా కార్డులు అందని లబ్ధిదారులు అనుసరించాల్సిన విధానాన్ని ముందుగానే తెలియజేయాలన్నారు.

డిచ్‌పల్లి బెటాలియన్‌లో స్వామివారి బ్రహ్మోత్సవాలు



అక్షరటుడే, డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గరుడ ప్రతిష్ఠ, హోమకుండ స్థాపన, వాస్తు సంబంధిత పూజలు, అగ్ని ప్రతిష్ఠ, అంకురారోపణ, వాస్తు హోమం, గరుడ సంబంధిత హోమాలు, ప్రాణప్రతిష్ఠ హోమం, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. తరువాత అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బలిహరణ, దేవతా ఆహ్వానం, నిత్య హవనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు స్వామివారి వాహన సేవ, మంత్రపుష్పం, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ సీతారాం, బెటాలియన్ అధికారులు సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు చుట్టుపక్క గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్‌లపై నీలినీడలు

- నిర్వహణ లేక.. నిరుపయోగం
- రూ.లక్షలు వెచ్చించినా ఆచరణ శూన్యం
- ఇబ్బందుల్లో ఆర్మూర్ ప్రజలు

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ఆలనాపాలనా లేక నిరుపయోగంగా మారాయి. వాటిని ఏర్పాటు చేసేటప్పుడు ఉన్న ఉత్సాహం, నిర్వహణ విషయంలో కనిపించకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోందని పట్టణ ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. **- అక్షరటుడే, ఆర్మూర్**

ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఏర్పడిన లేఅవుట్లలో నిబంధనల ప్రకారం కేటాయించిన 10 శాతం ఖాళీ స్థలాల్లో ప్రజల సౌకర్యార్థం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, పెర్కిట్, మామిడిపల్లి, కోటార్మూర్, రాజారాం నగర్, జర్నలిస్ట్ కాలనీ, విద్యానగర్, జిరాయత్ నగర్, మినీ స్టేడియం తదితర కాలనీల్లో ఒక్కోచోట రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేసి సైక్లింగ్, క్రాస్ ట్రైనర్, లెగ్ ప్రెస్, ఛెస్ట్ ప్రెస్, షోల్డర్ వీల్ వంటి ఆధునిక వ్యాయామ పరికరాలను అమర్చారు.

కొన్నినెలలకే..

ఏర్పాటు చేసిన కొద్ది నెలలకే ఈ జిమ్‌లు నిరుపయోగంగా మారాయి. నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బందిని కేటాయించకపోవడం, కనీసం



నెలకోసారైనా మరమ్మతులు చేయకపోవడంతో పరికరాలు తుప్పుపట్టి పోతున్నాయి. పలుచోట్ల సీట్లు విరిగిపోయాయి, నట్లుబోల్టులు ఊడిపోయాయి, గొలుసులు తెగిపోయాయి. దీంతో వ్యాయామం చేయాలని వచ్చే వృద్ధులు, యువకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. మరికొన్ని చోట్ల జిమ్‌ల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయి చెత్తాచెదారం పేరుకుపోయింది. రాత్రివేళ కనీస లైటింగ్ సౌకర్యం కూడా లేకపోవడంతో ఈ ప్రదేశాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాసిరకం పరికరాలే కారణమా..

కాంట్రాక్టర్లు నాసిరకం పరికరాలను అమర్చినా, అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయకుండానే బిల్లులు మంజూరు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నపాటి మరమ్మతుతో బాగయ్యే పరికరాలు సైతం అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా పాడైపోయాయని వాకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభోత్సవం రోజున ఫొటోలకు ఫోజులిచ్చారు. ఆ తర్వాత ఏ ఒక్క అధికారి కూడా ఈ జిమ్‌ల వైపు కన్నెత్తి చూడలేదు. ప్రజల ఆరోగ్యం కోసం పెట్టిన జిమ్‌లు ఇప్పుడు ప్రజలకే ప్రమాదకరంగా మారాయని కాలనీవాసులు మండిపడుతున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, పట్టణంలోని అన్ని ఓపెన్ జిమ్‌లపై సమగ్ర సర్వే నిర్వహించి, శిథిలమైన పరికరాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని, వాటి నిర్వహణ బాధ్యతను సంబంధిత కాలనీ సంక్షేమ సంఘాలకు, ప్రత్యేక సిబ్బందికి అప్పగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




షేర్ ఓంకార్ పటేల్‌కు ఘనసన్మానం



అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ నుండి లడక్ వరకు సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసిన షేర్ ఓంకార్ పటేల్‌ను ఘనంగా సన్మానించారు. అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్ శుక్రవారం ఆయనను సన్మానించారు. అయ్యప్ప శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేటి యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు షేర్ ఓంకర్ పటేల్ చేపట్టిన సైకిల్‌యాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత క్రీడలు, చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు.

జిల్లాస్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నీలో పెద్దకొడప్‌గల్ జట్టు విజయం



అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ : మాస్టర్స్ క్రికెట్ అకాడమీ (ఎంసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నీలో పెద్దకొడప్‌గల్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పెద్దకొడప్‌గల్ జట్టు 150 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా, కామారెడ్డి జట్టు 105 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో పెద్ద కొడప్‌గల్ జట్టు 45 పరుగుల తేడాతో విజయం సాధించింది. జట్టు కెప్టెన్ ఈ.స్వామి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అవార్డులు అందుకున్నారు. ఈ విజయంపై జట్టు సభ్యులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అన్నప్రసాద వితరణలో పాల్గొన్న ఛైర్‌పర్సన్



అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మ దేవి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని, సాంప్రదాయాలను పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు కాళ్ల గంగరాజు, పున్న రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు చిట్యాల రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నర్సింలు, శంకర్, ఆశయ్య, రాజు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారానికి డాక్టర్ బాలు ఎంపిక



అక్షరటుడే, కామారెడ్డి: జిల్లా కేంద్రానికి చెందిన ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర ఛైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు అత్యంత ప్రతిష్టాత్మకమైన రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ జాతీయ పురస్కారం 2026కు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈనెల 31వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న సమావేశంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా చేతులమీదుగ ఆయన అందుకోనున్నారు. ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసిన ఐవీఎఫ్ అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ గంజి రాజమౌళి గుప్త, ఐవీఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఐవీఎఫ్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్‌కు బాలు కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్ బాలు మాట్లాడుతూ 2007లో రక్తదాన కార్యక్రమాలను కామారెడ్డి కేంద్రంగా ప్రారంభించి నేడు రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. వ్యక్తిగతంగా 84 సార్లు రక్తదానం, తలసేమియా బాధిత చిన్నారుల కోసం 6,000 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించామన్నారు. 350కి పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించి 30వేల యూనిట్ల రక్తాన్ని సమకూర్చామన్నారు.

గ్రామ బహిష్కరణ చేసిన వీడీసీపై చర్యలు తీసుకోవాలి

అక్షరటుడే, కామారెడ్డి: సదాశివనగర్ మండలం తిర్మణ్‌పల్లి గ్రామంలో కల్లుగీత కార్మిక కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేసిన వీడీసీపై చర్యలు తీసుకోవాలని గౌడ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సదాశివనగర్ తహశీల్దార్‌కు మెమోరండం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ లింగా గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సైదగౌని వెంకట్ గౌడ్, జైగౌడ జిల్లా అధ్యక్షుడు మురళి గౌడ్ మాట్లాడుతూ.. తిర్మన్ పల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం గౌడ కులస్తులను గ్రామ కమిటీ డబ్బులు డిమాండ్ చేసిందన్నారు. వారు ఇవ్వకపోతే గ్రామ బహిష్కరణ చేశారని తెలిపారు. గౌడ కులస్తులతో ఎవ్వరూ మాట్లాడవద్దని, ఎవరూ వస్తువులు ఇవ్వవద్దని, ఇస్తే రూ.5వేలు జరిమానా విధిస్తామని గ్రామంలో చాటింపు వేయించారని ఆరోపించారు. గ్రామంలో సమాంతరంగా ప్రభుత్వం నడుపుతున్న గ్రామ కమిటీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్, ఎస్పీకి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాగౌడ్, తిర్మన్‌పల్లి గీత కార్మికులు స్వామి గౌడ్, మైసాగౌడ్, మల్లా గౌడ్, శ్రావణ్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, చిన్న మైసాగౌడ్, మహేష్ గౌడ్, బాలాగౌడ్, మండల గౌడ సంఘం నాయకులు సాయి గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





మున్నూరుకాపుల ఐక్యత కోసమే 'దసరా సమ్మేళనం'

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మున్నూరు కాపుల ఐక్యత కోసమే దసరా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు మాజీ మేయర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ అన్నారు. జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మహిళలు, పురుషులకు, పిల్లలకు మ్యూజికల్ చైర్‌గేమ్ ఆడించారు. గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ధర్మపురి సంజయ్ మాట్లాడుతూ.. మున్నూరు కాపులు ఐక్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణించగలరని ఆలోచించి జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. మాజీ మంత్రి, దివంగత ధర్మపురి శ్రీనివాస్ సంఘం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. మున్నూరు కాపులందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు సంఘ భవనాలు నిర్మించారని గుర్తు చేశారు. తాను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత వనభోజనాలు ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో.. మొదటిసారి దసరా సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేశ్వర్, దారం సాయిలు, ధర్మపురి సురేందర్, బంటు రాజయ్య, ఆకుల రమేష్, దారం సాయిలు, అర్జున్ ప్రకాష్, మెండి సంతోష్, అబ్బాయి లింబాద్రి, రేంజర్ల గంగాధర్ పాల్గొన్నారు.

రెండేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం.. పోలీసుల అదుపులో నిందితులు!

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి పట్టణంలో నెల రోజుల క్రితం రెండేళ్ల బాలుడు కిడ్నాప్‌నకు గురయ్యాడు. గణేష్ ఉత్సవాల సందర్భంగా తల్లిదండ్రులతో వచ్చిన బాలుడు కిడ్నాప్ కావడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోలీసులు వివరాలు సేకరించి నమ్మదగిన సమాచారం మేరకు రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో బాలుడిని దాచినట్లుగా గుర్తించారని సమాచారం. ఇంట్లోని ఓ గదిలో తాళం వేసి ఉండగా అందులో ఉన్న బాలుడిని బయటకు తీసుకువచ్చి భార్యాభర్తలను అదగగా పొంతన లేని సమాధానం చెప్పినట్లుగా సమాచారం. బాలుడిని తీసుకొచ్చిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా సమాచారం. ఈ కిడ్నాప్‌నకు కారణం ఏమిటో ఇంకా తేలలేదు. అయితే బాలుడిని పెంచుకోవడం కోసం కిడ్నాప్ చేశారన్న ప్రచారం బయట సాగుతోంది. పోలీసుల విచారణలో అసలు కారణం తేలుతుందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ కేసులో ఇంకా ఎవరెవరి పాత్ర ఉందోనని పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నట్లుగా సమాచారం. ఈ విషయమై కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్‌ను వివరణ కోరగా బాలుడి కిడ్నాప్ విషయంలో విచారణ కొనసాగుతుందన్నారు. బాలుడిని పెంచుకోవడం కోసమే తీసుకెళ్లినట్లుగా తెలుస్తుందన్నారు. విచారణ కొనసాగుతుందని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.